



మెదక్ పట్టణ పరిధిలోని ఔరంగాబాద్‌లో వరదలో కొట్టుకుపోయిన వడ్లు

భూములైనా ఇవ్వండి.. స్థలమైనా చూపండి

- జిన్నారం, జంగంపేటలో హెచ్‌ఎండీఏ లేఅవుట్ కోసం 185 ఎకరాల సేకరణ
- ఎకరా భూమికి పరిహారంగా 600 గజాల స్థలం ఇవ్వడానికి అంగీకారం
- ఏడాది దాటినా ఎక్కడి పనులు అక్కడే..
- ఇటీవల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు
- బాధితుల పక్షాన బీఆర్ఎస్ ఆందోళన



జిన్నారంలో హెచ్ఎండీఏ సేకరించిన స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్

జిన్నారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, అసైన్డ్ భూములను సేకరించి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లేఅవుట్‌లుగా మార్చి విక్రయించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల భవిష్యత్తుపై గందరగోళం నెలకొన్నది. భూములు సేకరించి ఏడాది గడిచినా లైఅవుట్ పనులు ప్రారంభించకపోవడం.. పరిహారం కింద ఇస్తామన్న స్థలాల పొజిషన్లు చూపకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని జిన్నారం, జంగంపేటలో 185 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని సేకరించారు. జిన్నారం సర్వే నంబర్ 1లో 121 ఎకరాలు సేకరించాలని నిర్ణయించి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో 80 ఎకరాలను అసైన్డ్ రైతులు స్వచ్ఛందంగా అందజేశారు. మిగిలిన రైతులు కోర్టుకు నుంచి స్టే తీసుకురావడంతో 40 ఎకరాల స్థల సేకరణ చేపట్టలేదు. జంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 376లో 136 ఎకరాలను గుర్తించగా.. ఇప్పటివరకు 105 ఎకరాలు సేకరించారు. అసైన్డ్ భూములను ఇచ్చిన రైతులకు పరిహారంగా ఎకరాకు 600 గజాల చొప్పున స్థలాన్ని హెచ్ఎండీఏ ఏర్పాటు చేయనున్న లేఅవుట్‌లో ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు కొందరికి పట్టాలను కూడా అందజేశారు.. కానీ పొజిషన్ చూపలేదు. మరోవైపు స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఇటీవలే హెచ్ఎండీఏ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

లేఅవుట్ ఏర్పాటు ఎప్పుడో?

లేఅవుట్ భూములు ఇచ్చిన అసైన్‌మెంట్ రైతులకు స్థలం కేటాయించినట్లు ప్రకటించిన అధికారులు నేటికీ పొజిషన్ చూపలేదు. సేకరించిన భూముల్లో లేఅవుట్ అభివృద్ధి పనులు కూడా ఇంతవరకు ప్రారంభించలేదు. దీంతో ప్రాజెక్టు భవితవ్యంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టు కావడంతో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా.. లేదా.. అనే అనుమానాలు నెలకొన్నాయి.

పొజిషన్లు చూపండి

ఏడాది కిందట రైతుల నుంచి సేకరించిన భమూలకు నష్ట పరిహారంగా అందజేసిన 600 గజాల స్థలం ఎక్కడో వెంటనే పొజిషన్లు చూపాలని లేదా తమ భూములు తిరిగి ఇవ్వాలని రైతులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. 15 రోజుల్లో హెచ్ఎండీఏ అధికారులతో మాట్లాడి రైతుకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఆందోళనలో నాయకులు రాజేష్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, రైతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

వర్షార్పణం



రామాయంపేట మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

ఒక్కసారిగా దంచికొట్టిన వాన అన్నదాతను ఆగం చేసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం అతలాకుతలం చేసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లెదుటే వర్షార్పణమైంది. సోమవారం మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన వర్షం ధాటికి పంటలకు నష్టం వాటిల్లింది.

- మెదక్ జిల్లాలో వాన బీభత్సం
- తడిసిముద్దయిన ధాన్యపు రాశులు
- అన్నదాతకు తీరని నష్టం
- కేంద్రాలకు చేరుకుంటున్న ధాన్యం
- ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు

మెదక్/చిన్నశంకరంపేట్/వెల్దుర్తి/చేగుంట/రామాయంపేట/కొల్చారం/హవేళీఘణపూర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని పది మండలాల పరిధిలో సోమవారం వరుణుడు ప్రతాపాన్ని చూపించాడు. ఆయా గ్రామాల పరిధిలో ఇప్పటికే కొన్నిచోట్ల వరికోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని శుద్ధి చేసి కొనుగోలు కేంద్రాల వద్ద, గ్రామాల పరిధిలోని రోడ్లపైనా ఆరబోసి రాత్రనక పగలనక పడిగాపులు కాస్తున్నారు. సాయంత్రం వేళ ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో గంటకుపైగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వాన నీటి ప్రవాహానికి కొన్నిచోట్ల ధాన్యం కొట్టుకుపోయింది. చిన్నశంకరంపేట, వెల్దుర్తి, రామాయంపేట, కొల్చారం, చేగుంట, హవేళీఘణపూర్ మండలాల పరిధిలో ఎక్కువగా ప్రభావం చూపించింది. పాపన్నపేట, మాసాయిపేట, నిజాంపేట, నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోనూ పలు గ్రామాల్లో కురిసిన వర్షం ధాటికి కల్లాల్లో ధాన్యం తడిసింది. కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో పంట కోత దశలో గాలివాన కురియడంతో పంట నేలకొరిగింది. రామాయంపేట-దౌల్తాబాద్ రహదారిలో మొక్కజొన్న వాన నీటికి కొట్టుకుపోయింది. మెదక్ మార్కెట్‌యార్డులో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు తట్టలు, పారలతో ధాన్యాన్ని ఒకచోటుకు చేర్చి తడిసిన ధాన్యాన్ని చేతుల్లోకి తీసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. రామాయంపేటలోని పలు కాలనీలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. రహదారులపై నిలిపిన బైకులు నీటమునిగాయి.

ఇంకా ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు

జిల్లాలో వరికోతలు ఊపందుకున్న తరుణంలో వర్షంతో రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యయ ప్రయాసలు కోర్చి పండించిన పంట తమ కళ్ల ముందే

మిగతా 8వ పేజీలో..



వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన వడ్లు

పిడుగుపాటుకు మేకల మృతి



హవేళీఘణపూర్ మండలం శాలిపేట సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

హవేళీఘనపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శాలిపేట సమీపంలో పిడుగుపాటుకు ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి. వరంగల్ జిల్లా నుంచి వలస గొర్రెల పెంపకందారులకు చెందిన వారు ఎల్లారెడ్డి వైపు నుంచి మెదక్ వైపు గొర్రెలు, మేకలను మేపుకుంటూ మండలంలోని శాలిపేట గ్రామం నుంచి వెళ్తున్నారు. మేకల మందపై పిడుగుపడటంతో ఏడు మృతి చెందాయి. దీంతో లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

వారి కుటుంబాలకు అండగా ఉంటాం : మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు



సంగారెడ్డిలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తూ కన్నీరు పెట్టుకుంటున్న అమరుల కుటుంబ సభ్యురాలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన పోలీసు సంస్మరణ సభల్లో వారు మాట్లాడారు. అంతకు ముందు అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసులు ప్రాణాలకు తెగించి ఎన్నో త్యాగాలు చేస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. శాంతిభద్రతలను ప్రజలకు సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడానికి శాంతిభద్రతలు చాలా ముఖ్యమన్నారు. మెదక్ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఇప్పటి వరకు 14 మంది పోలీసులు వీరమరణం పొందారని పేర్కొన్నారు. , వారి త్యాగాలు వృథా కాదన్నారు. అమరుల కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అనంతరం అమరులైన పోలీసు కుటుంబాలను పరామర్శించి, జ్ఞాపికలను అందజేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, సైబర్‌క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సాయుధదళ డీఎస్పీ రంగనాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్, విజయకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్, పరేడ్ కమాండర్ డానియల్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంగారెడ్డి ఎస్పీ, కలెక్టర్



మెదక్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



సాలిబాయికి పాస్‌బుక్ అందజేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

20 ఏళ్ల భూ సమస్యకు ప్రజావాణిలో పరిష్కారం

మహిళా రైతు అర్జీపై స్పందించిన సంగారెడ్డి కలెక్టర్

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా పరిష్కారం కాని భూసమస్య సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి చొరవతో పరిష్కారానికి నోచుకుంది. ప్రజావాణి దరఖాస్తుపై స్పందించి భూరికార్డులను సరిచేయించి పట్టా ఇప్పించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం కొండాపూర్‌కు చెందిన పాత్‌లోత్ సాలిబాయికి గ్రామ శివారులో 1.35 ఎకరాల పొలం ఉన్నది. కానీ, రికార్డుల్లో కేవలం 35 గుంటలు మాత్రమే నమోదు కావడంతో అంతవరకే అధికారులు పట్టా ఇచ్చారు. మిగిలిన భూమిని రికార్డుల్లో నమోదుచేసి మొత్తానికి పట్టా ఇప్పించాలని సాలిబాయి అధికారుల చుట్టూ తిరుగుతున్నది. 20 సంవత్సరాలుగా మండలస్థాయి, డివిజన్‌స్థాయి, జిల్లాస్థాయి అధికారులను అనేకసార్లు మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆమె గత ఫిబ్రవరి 27న ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కలెక్టర్ క్రాంతి సమస్యను తెలుసుకొని, దరఖాస్తును టీఎం33 మాడ్యూల్ కింద నమోదు చేయించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈమేరకు రెవెన్యు అధికారులు భూరికార్డులను సరిచేసి పట్టా ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. సర్వే నంబర్ 26/20ఈఈలో ఎకరం భూమిని చేర్చారు. 1.35 ఎకరాలకు టీ0916009017 నంబర్‌తో పాస్‌బుక్‌ను తయారు చేయించి సోమవారం సాలిబాయికి అందజేశారు. 20 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కరించడంపై రైతు సాలిబాయి సంతోషం వ్యక్తంచేశారు.

'ప్రజావాణి'కి బాధితుల క్యూ

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్లు

8

చేపల పెంపకంపై వివాదం

మిన్‌పూర్‌లో మరోసారి ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు, పోలీసులు



అధికారులకు సమస్యను వివరిస్తున్న మాజీ సర్పంచ్

పుల్‌కల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపలు పట్టుకునే విషయంలో చెలరేగిన వివాదం ముదరడంతో పుల్‌కల్ మండలం మిన్‌పూర్ గ్రామంలో ఉద్రిక్తతలకు దారితీసింది. గ్రామంలో మొత్తం 10 చెరువులు, కుంటలు ఉన్నాయి. చేపల పట్టే వృత్తి చేపట్టే ముదిరాజ్‌లు పెద్దచెరువులో చేపట్టుకునేవారు. మిగిలిన చెరువులు, కుంటల్లో ఇతర కులాలవారు చేపలు పట్టుకునేవారు. కానీ, చేపలపెంపకం వృత్తిపై ఆధారపడి జీవించే తమకే గ్రామంలోని మొత్తం చెరువులు, కుంటలపై అధికారాలుంటాయని ముదిరాజ్‌లు కొంతకాలంగా వాదిస్తున్నారు. ఈమేరకు ఇటీవల గ్రామంలోని అన్ని చెరువుల్లో చేపలు పట్టి విక్రయించడంతో గ్రామంలో వివాదానికి దారితీసింది. దీంతో, పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. పూర్వం నుంచి ఎలా చేపలు పట్టుకుంటున్నారో అదే విధానాన్ని కొనసాగించేందుకు ఇరువర్గాలు ఒప్పుకుంటూ ఒప్పందపత్రాన్ని రాసుకుని సంతకాలు చేశారు.

మరోసారి ఘర్షణ

ఇదే విషయంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రామంలో ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ, సోమవారం ఉదయం కల్లు దుకాణంలో తలెత్తిన వివాదం మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. సమాచారం అందుకు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి గ్రామాకిఇ చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, పుల్కల్ తహసీల్దార్ కృష్ణ, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, జోగిపేట, కొండాపూర్ సీఐలు అనిల్‌కుమార్, చంద్రయ్య, సంగారెడ్డి మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రమీల, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, మత్స్య శాఖ ఏడీ నర్సింహారావు, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్లు తెనుగు రమేశ్, నాగరాజు, నగేశ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రంగనాయక్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో సమావేశమయ్యారు. ఇరువర్గాల వాదనలు విన్న అధికారులుఉ గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు నడుచుకోవాలని ఒప్పించారు. అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు మాట్లాడుతూ గ్రామస్థులంతా గొడవలు మానుకుని గ్రామాభివృద్ధిపై దృష్టిసారించాలని కోరారు. ఇకపై వారానికోసారి గ్రామాన్ని సందర్శిస్తానని చెప్పారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య మాట్లాడుతూ సంయమనం పాటించాలని కోరారు. చట్టాని అతక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'సింగూరు'కు కొనసాగుతున్న వరద

పుల్‌కల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టులోకి 5,241 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఆ వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. గత సెప్టెంబరు 5వ తేదీన ప్రారంభమైన వరద నీటి ప్రవాహం ఇంకా నేటికీ కొనసాగుతూనే ఉంది. సోమవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 5,241 క్యూసెక్కులు నమోదవగా, అవుట్‌ఫ్లో 13,471 క్యూసెక్కులు నమోదయింది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు 6వ నంబరు క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తి 10,746 క్యూసెక్కులు, రెండు జలవిద్యుత్ గేట్ల ద్వారా 2,725 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీర రిజర్వాయర్‌కు వదులుతున్నారు. మొత్తంగా 13,471 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదయింది. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సమార్థ్యం 29.917 టీఎంసీలు కాగా, అంతే స్థాయిలో నీటి నిల్వలు కొనసాగిస్తున్నారు. జెన్‌కో సారథ్యంలోని 7.5 జల విద్యుత్ ఉత్పత్తి సమార్థ్యం గల రెండు టర్బయిన్లు పనిచేస్తున్నాయి.



తక్కువ పీచు.. ఎక్కువ ఘాటు

- కోహీర్ అల్లానికి భలే డిమాండ్
- మండలంలో విస్తారంగా పంట
- యేటా 1200 ఎకరాల్లో సాగు

7

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

- తాళం పగులగొట్టి భారీ చోరీ
- రూ.18 లక్షలు, 21 తులాల బంగారం,
- మూడు కిలోల వెండి అపహరణ

7

విద్యుదాఘాతానికి ముగ్గురు రైతులు బలి

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మహిళ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావ్య, రేణుక, శివలక్ష్మి, సీసీలు రమేష్ రెడ్డి, దేవరాజ్, స్వామి పాల్గొన్నారు.

ఐఆర్‌డీ వైఖరిని నిరసిస్తూ ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏజెంట్లు

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు హెడ్‌గా వ్యవహరించే ఐఆర్‌డీ(ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎల్ఐసీ యాజమాన్యాల వైఖరిని నిరసిస్తూ సోమవారం ఎల్ఐసీ ఏజెంట్లు పట్టణంలోని కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఆర్‌డీ తీసుకొచ్చిన నిర్ణయం పాలసీదారులకు, ఏజెంట్లకు ఇబ్బందిగా మారనున్నదన్నారు. ఎల్ఐసీ పాలసీని తీసుకునే వారి వయస్సును 50 ఏళ్లకు కుదించారని, పాలసీ హోల్డర్‌కు బోనస్‌ను పెంచలేదన్నారు. తమ సమస్యకు పరిష్కారం లభించేవరకు ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు తేజరెడ్డి, వెంకటేశం, సుభాష్, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు

● సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు అని, సాగు, తాగుకు ఇవ్వాల్సిందేనని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జిల్లా మూడో మహాసభలు దిగ్విజయంగా ముగిశాయన్నారు. జిల్లాలో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నా కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య



అనీల్(ఫైల్)

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలోని 6వ వార్డు కృష్ణానగర్ కాలనీలో దారుణం చోటు చేసుకున్నది. ఆ కాలనీకి చెందిన తబ్యా అనీల్(27) హత్యకు గురయ్యాడు. స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకెళ్లిన అనీల్ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ఉదయం కాలనీ సమీపంలో ఓ నర్సరీలోని షెడ్డులో కత్తి పోట్లతో రక్తపు మడుగులో అనీల్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. అనీల్ హత్యకు పాత కక్షలే కారణంగా తెలుస్తున్నది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలింగ్‌ను ఢీకొట్టిన బైకు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

బెజ్జంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బైకు రైలింగ్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్ (25), భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ స్నేహితులు. కరీంనగర్‌లో రూమ్ అద్దెకు తీసుకొని వివిధ పనులు చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై బెజ్జంకి వైపు బైకుపై వస్తున్న క్రమంలో మండలంలోని తోటపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారి పక్కకు ఉన్న రైలింగ్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బోనగిరి మనోజ్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



లింగంచారి (ఫైల్)

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పాత లింగాయపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కమ్మరి లింగంచారి(36) హైదరాబాదులో మేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసరా పండుగ కోసం గ్రామానికి వచ్చి అప్పటి నుంచి అక్కడే ఉన్నాడు. కొన్ని నెలలుగా పని సరిగా లేక సంసారం నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గం లేక నిత్యం భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన లింగంచారి సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగడపల్లి గ్రామ చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సోమవారం ఉదయం చెరువులో 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం తేలగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్నవారు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద హరితా హోటల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నీరసించి లేవలేని స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని 108లో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. నాగ్సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి 65-70 ఏళ్ల వయస్సు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, ధోతీ ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ నంబర్ 8712657920ను సంప్రదించాలని కోరారు.

మహిళా సంఘాలకు నాటు కోళ్ల పంపిణీ

రాయపోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని పలు గ్రామాల మహిళా సంఘాలకు సోమవారం నాటు కోళ్లను పంపిణీ చేశారు. ఒక కోడి రూ.105 చొప్పున చెల్లించిన సంఘాలకు గ్రామానికి 50 కోళ్ల చొప్పున 1100 కోళ్ళు అందజేసినట్లు ఏపీఎం కిషన్ తెలిపారు.



కోహీర్ మండలంలో సాగు చేస్తున్న అల్లం పంట

తక్కువ పీచు.. ఎక్కువ ఘాటు

కోహీర్ అల్లానికి భలే డిమాండ్.. మండలంలో విస్తారంగా పంట

- యేటా 1200 ఎకరాల్లో సాగు
- సారవంతమైన ఎర్రనేలలతో నాణ్యమైన పంట దిగుబడి



కోహీర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : కూర అయినా.. ఊరగాయ అయినా ఘుమఘుమలాడలాంటే కాస్త అల్లం దట్టించాల్సిందే. ఘాటుతనం.. కారం పాలు అధికంగా కల.. పీచుదనం తక్కువగా ఉండే అల్లం తగిలితే వంటకం యమ రుచిగా తయారవుతుంది. అలాంటి నాణ్యమైన అల్లం పంటకు పేరుగాంచింది సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం. కుంకుమను పోలిన ఇక్కడి ఎర్రని నేలల్లో పండే అల్లంలో తేమ శాతం అధికంగా ఉండడంతో ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది. పీచు లేని ఈ అల్లంతో తయారు చేసిన పేస్టు చాలా రోజుల వరకు నిల్వ ఉంటుంది. ఔషధ గుణాలు అధికంగా ఉండడం వల్ల శొంఠి తయారీలో ఎక్కువగా వాడుతారు. ఆయుర్వేద మందుల తయారీకి కోహీర్ అల్లం ఉపయోగపడుతుంది.

అనువైన నేలలు.. అనుకూల వాతావరణం

కోహీర్ మండలంలో అనువైన ఎర్రనేలలు, అనుకూల వాతావరణం ఉండడంతో రైతులు ఎక్కువగా దేశీయ అల్లం (కోహీర్ అల్లం) పంటను పండిస్తారు ఏటా 1200 ఎకరాల్లో పంట సాగవుతున్నది. మండలంలోని బిలాల్‌పూర్, మాచిరెడ్డిపల్లి పీచేర్యగడి, సజ్జాపూర్ మనియార్‌పల్లి, బడంపేట, గురుజువాడ, గొటిగార్‌పల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో అల్లం అధికంగా పండిస్తారు. ఒక్కోసారి మార్కెట్లో ధర లేక నష్టం వాటిల్లినా నిరుత్సాహపడకుండా తర్వాత సంవత్సరం మళ్లీ అల్లం పంటనే పండిస్తారు. ఒక యేడు నష్టం వచ్చిన మరో ఏడాదైనా రెండింతలు లాభం వస్తుందని రైతుల నమ్మకం. ఇక్కడి చిన్న, సన్నకారు రైతులు సైతం తమకున్న పొలంలో ఎంతో కొంత అల్లం పంటను సాగు చేయక మానరు.

ఎనిమిది నెలల పంటకాలం

ఎకరాకి నాలుగు పుట్ల (ఆరు క్వింటాళ్ల) అల్లం విత్తనం వేస్తారు. మూడు లారీల పేంట ఎరువు(సేంద్రియ ఎరువు), ఒక లారీ కోడి ఎరువు వేస్తారు. మొదట దూకి చేసుకున్న తర్వాత ఎరువులు వేసి బోదే దూకి చేసి అల్లం విత్తనం వేస్తారు. అనంతరం డ్రిప్ పైప్ లైన్ల ద్వారా నీటిని అందిస్తారు. కొంత మంది డ్రిప్ లేకుండా నీటిని అందిస్తారు. 20 రోజుల తర్వాత మొలకెత్తుతుంది. ఎనిమిది నెలల తర్వాత పూర్తి పంట వస్తుంది. పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్లో ఒకవేళ ధర లేకుంటే మరో ఆరు నెలల వరకు అల్లాన్ని తవ్వకుండా భూమిలోనే ఉంచినా పాడవదు. ప్రస్తుతం అల్లం సాగు చేయడానికి ఎకరాకు లక్ష ఖర్చవుతుంది.

సారవంతమైన ఎర్ర భూమి

కోహీర్ మండలంలో 70 శాతం ఎర్రనేలలు ఉన్నాయి. కుంకుమను పోలిన ఈ ఎర్ర భూములు ఎంతో సారవంతమైనవి. ఈ భూమిలో పండిన ఏ పంటకైనా రుచి ఎక్కువగా ఉంటుంది.. పోషక విలువలు అధికంగా ఉంటాయి. ఎర్రని భూముల్లో తేమశాతం తక్కువ. వర్షాలు అధికంగా కురిసినా భూమి లోపల ఉండే పంట పాడవకుండా నిల్వ ఉంటుంది. సాగుకు నీరు అధికంగా అవసరం. అల్లం, చెరుకు, ఆలుగడ్డ, పసుపు, అరటి, మిరప, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలకు ఎర్ర నేలలు అనువైనవి కాగా మండలంలో రైతులు ఎక్కువగా అల్లం సాగువైపు మొగ్గు చూపుతారు.

నాడు ఆటో డ్రైవర్‌ను.. నేడు అల్లం రైతును..



పదేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో అల్లం సాగు చేసి లాభాలు పొందాను. అప్పటి నుంచి ఆటో వృత్తిని మానుకొని అల్లం రైతుగా మారాను. ప్రతీ సంవత్సరం ఐదు నుంచి 10 పుట్ల అల్లం వేస్తాను. ఏటా అధిక దిగుబడి సాధిస్తూ లాభాలు పొందుతున్నాను.

\- భాస్కర్, బిలాల్‌పూర్

కోటి రూపాయల అల్లం పండించా..



కొన్నేళ్లుగా అల్లం పంట సాగు చేస్తున్నాను. 8 సంవత్సరాల క్రితం కోటి రూపాయల అల్లం పంటను పండించాను. ఇలా ప్రతీ యేటా మంచి లాభాలు పొందుతున్నాను. ఒక సంవత్సరం నష్టం వచ్చినా మరో సంవత్సరం లాభాలు వస్తాయని నమ్మకంతోనే అల్లం సాగు చేస్తున్నాను.

\- మల్లికార్జున్, వెంకటాపూర్

విద్యుదాఘాతానికి ముగ్గురు రైతులు బలి

● వేర్వేరు చోట్ల ఘటనలు

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగులపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపల్లి గ్రామానికి చెందిన మునిపల్లి బాబు(35) సోమవారం ఉదయం 11గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో బోర్‌మోటార్ ఆన్ చేస్తుండగా మోటార్ స్టార్టర్ నుంచి విద్యుత్ ప్రవహించడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాబుకు భార్య వీణ, ఇద్దరు పిల్లలు భానుతేజ్(6), భార్గవి(4) ఉన్నారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

మిషన్ తగిలి వైర్లు తెగిపడి..



దుర్గేష్ (ఫైల్)

హత్నూర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి కోత మిషన్‌కు విద్యుత్ వైరు తగిలి తెగిపడడంతో షాక్‌క గురై రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగుల్ దేవులపల్లిలో సోమవారం జరిగింది. ఆ గ్రామానికి చెందిన పడాల దుర్గేష్ (30) తన పంట పొలంలో వరి కోత కోస్తుండగా.. మిషన్ తగిలి విద్యుత్ వైరు తెగిపడింది. బురదగా ఉన్న పొలంలో ఉన్న రైతు దుర్గేష్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వరి కోత మిషన్ డ్రైవర్ ప్రాణాలతో బయట పడ్డాడు. మృతుడికి భార్య లత, ఐదు నెలల పాప ఉన్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

పంట రక్షణ కోసం వేసిన తీగలు తగిలి..



కిషన్ (ఫైల్)

వెల్దుర్తి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యశ్వంతరావుపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసువల్లి కిషన్(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలం వద్ద అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించుకోవడం కోసం విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం పొలం వద్ద వెళ్లిన కిషన్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి వెతకగా విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాడు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజు తెలిపారు. అలాగే శనివారం అదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య తన వ్యవసాయ పొలంలో పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలిమృతి చెందాడు. వరుసగా ఇద్దరు రైతులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్లులకు ఎంపికైన క్రీడాకారులు

ఉత్సాహంగా క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఎం.ఎస్. అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలిరాగా, ప్రతిభ చూపినవారిని నాలుగు జట్లుగా ఎంపిక చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారితో తుది జట్టు ఎంపిక ప్రక్రియ నేటి నుంచి చేపట్టనున్నారు. తుది జిల్లా జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 4 వ తేదీన సంగారెడ్డి, వరంగల్‌లో జరిగే అండర్-23 అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఏ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ సభ్యులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కోచ్‌లు చంద్రమౌళి, ఇనాం, మహేందర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కరాటే, తైక్వాండో ఎంపికలు

ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న సదాశివపేటలోని విజ్ఞాన్ మోడల్ హైస్కూల్‌లో అండర్-19 బాల బాలికల కరాటే, తైక్వాండో జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9848578970, 8106841226 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

తాళం పగులగొట్టి భారీ చోరీ
రూ.18 లక్షలు, 21 తులాల బంగారం, మూడు కిలోల వెండి అపహరణ
అనంతగిపల్లిలో రూ.70వేల నగదు, నగలు



కోహీర్: బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

కోహీర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీచేర్యాగడి పాత తండాలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే తండా సమీపంలోని దుర్గమ్మ-మైసమ్మ ఆలయ పూజారి రమేష్ స్వామి ఆ ఆలయ సమీపంలోనే నివాసముంటున్నాడు. రమేష్ స్వామికి మరో ముగ్గురు సోదరులున్నారు. ఆ నలుగురికి చెందిన నాలుగు ఎకరాల భూమిని విక్రయించి ఆ డబ్బుతో గతంలో జహీరాబాద్‌లో ఓ ఇల్లు కొనుగోలు చేశారు. ఇటీవల ఆ ఇల్లును విక్రయించగా వచ్చిన రూ.18 లక్షలతో పాటు వారందరికి చెందిన వెండి, బంగారంను కూడా రమేష్ ఇంట్లోనే దాచారు. కాగా, ఆదివారం రాత్రి రమేష్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన అతడికి తలుపులు తెరిచి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో ఉన్న రూ.18 లక్షల నగదు, 21 తులాల బంగారం, మూడు కిలోల 70 గ్రాముల వెండి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులకు అక్కడికి చేరుకుని క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించారు.

అనంతగిరిపల్లిలో..

వర్గల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరిపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి మల్లేష్ ఈ నెల 19న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గజ్వేల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.70వేలు, అర తులం బంగారు చైన్, 15 తులాల వెండి ఆభరణలు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి క్లూస్ టీంతో కలిసి చేరుకుని ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వర్గల్: చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడి

ఆలయాలపై దాడులకు నిరసనగా బీజేపీ ర్యాలీ



జిన్నారంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో జిన్నారంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. దాతల నుంచి 103 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాజశేఖర్, దేమో యాదగిరి, బోస్, డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

స్టడీటూరుకు 26 మంది అధికారులు

- 8 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటన
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి పర్యటన ఉద్యోగి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ఎనిమిది రోజుల పాటు పర్యటనకు వచ్చిన ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందంతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 28 వరకు మొదటి ఐదు రోజులు గ్రామ స్థాయిలో, చివరి మూడు రోజులు అర్బన్ ఏరియాల్లో 26 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు పర్యటిస్తారన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పరిశీలిస్తారన్నారు. జిల్లాలోని అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ వారికి వివరించారు. సమావేశంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ శంకర్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఏవో గోవింద్, డీఎంహెచ్‌వో డా॥శ్రీరాం, జిల్లా సంక్షేమాధికారి హైమావతి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలిండియా సర్వీసెస్ అధికారులు



రాయిలపూర్‌లో అధికారులకు స్వాగతం..

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 21 : సివిల్ సర్వీస్ ఉద్యోగంలో భాగమైన ఫౌండేషన్ కోర్సు శిక్షణ కోసం ఆలిండియా సర్వీసెస్ అధికారుల బృందాలు సోమవారం పలు గ్రామాలకు చేరుకున్నాయి. వారు మూడునాలుగు రోజుల పాటు గ్రామాల్లోనే పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి జరుగుతున్న తీరును పరిశీలించి అధ్యయనం చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల తీరు, ప్రజారోగ్యం నిర్వహణను పరిశీలిస్తారు. అలాగే జనాన్ని చైతన్యం చేస్తూ.. గ్రామ పురోభివృద్ధి విషయంలోనూ ఈ బృందం చర్చిస్తుంది. తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం, కొడిపల్లి మండలంలోని రాయిలపూర్, నర్సాపూర్ మండలం ఆవంచ, రామాయంపేట మండలం ప్రగతిధర్మారం గ్రామాలకు అధికారులు చేరుకున్నారు. వారికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సాదారంగా ఆహ్వానం పలికారు. ఆవంచ గ్రామంలో మంగళహారతులు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు.

చేగుంటలో కారు దగ్ధం



చేగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏసీ షార్టు సర్క్యూట్ తో మంటలు చెలరేగి ఆల్టో కారు దగ్ధమైన సంఘటన చేగుంట మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా ఆందోల్ పట్టణానికి చెందిన రాఘవేంద్రశర్మ చేగుంటలోని తమ సమీప బంధువు కృష్ణ రఘురామశర్మ ఇంటికి సోమవారం మధ్యాహ్నం వచ్చారు. కారును ఇంటి ఎదుట రైస్‌మిల్ ఆవరణలో చెట్టు కింద నిలిపి బంధువుల ఇంటి లోపలికి చేరేలోపు కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి రామాయంపేట ఫైర్ ఇంజన్ వచ్చేలోపు కారు పూర్తిగా కాలిపోయింది.

జనశక్తి మాజీనేత బాలన్న పాడె మోసిన అమర్



బాలన్న పాడె మోస్తున్న జనశక్తి పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్

మిరుదొడ్డి, అక్టోబరు21(అంధ్రజ్యోతి): జనశక్తి పార్టీ మాజీ నాయకుడు, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాలన్న ఆదివారం రాత్రి మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో అనారోగ్యంతో మరణించారు. సుమారు 40 ఏండ్లపాటు విప్లవ ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన కుమారుడు భాస్కర్ అరుణోదయ సంస్థలో డోలక్ వాయిద్యకారుడిగా ఉంటూ, ఉస్తాద్‌బిస్మిల్లాఖాన్ అవార్డును కూడా పొందారు. సోమవారం గ్రామంలో జరిగిన బాలన్న అంత్యక్రియల్లో జనశక్తి రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్ పాల్గొని పాడె మోశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమయ్యలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాలన్న మృతిపై డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లింగుపల్లి శంకర్ సంతాపం తెలిపారు.

ఖేడ్ డిపోకు రూ.1.30 కోట్ల ఆదాయం

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు పదిరోజుల్లో రూ.1.30 కోట్ల ఆదాయం రావడంతో సోమవారం డిపో ఆవరణలో డీఎం మల్లేశయ్య కష్టపడి విధులు నిర్వర్తించిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కష్టపడిన కార్మికులందరికీ బహుమతులను అందించినట్లు డీఎం తెలిపారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

పటాన్‌చెరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో రీల్స్ చిత్రీకరణ చేయడంపై విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ పవిత్రత దెబ్బతీసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోపిస్తూ విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు సుభాష్‌చంద్ర సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంపై సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తన ఛాంబర్‌లో చెత్త సేకరణ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మనోహరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రంగాయపల్లి గ్రామంలో ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ లిమిటెడ్ పరిశ్రమ సహకారంతో ఉషోదయ లేజర్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిశ్రమ డైరెక్టర్ అనురాగ్ అగర్వాల్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న వృద్ధులకు, ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగు పరిచేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు

పటాన్‌చెరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో రైతులు మద్దతు ధర అడిగినందుకు బేడీలు వేసి జైళ్లలో పెట్టిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. సోమవారం పటాన్‌చెరు కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ పేరుతో పదేళ్లు పదవుల్లో కొనసాగిన బీఆర్ఎస్ రైతులను నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే 40 లక్షల మందికి 18వేల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు.

అయోడిన్ ఉప్పు లేకుంటే అనారోగ్యాలు ఎన్నో

మెదక్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ ఉప్పు లేకుంటే అనారోగ్యాలు ఎన్నో అని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అయోడిన్ కలిగి ఉన్న ఉప్పును మాత్రమే వాడాలన్నారు.

సిద్ధారెడ్డికి ఎక్సలెన్సీ అవార్డు

సంగారెడ్డి అర్బన్: చౌటకూర్ మండలం కోర్పోల్ జడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి రాష్ట్రస్థాయి టీచర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, స్కైలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లాప్లానిటోరియం ఆడిటోరియంలో అవార్డుల ప్రదానం నిర్వహించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమయ్య, డా.షైనష్ జిందాల్, డా.జ్యోత్స్నరావు, డీఎంఆర్ఎల్ సైంటిస్టు నిరంజన్, సొసైటీల వ్యవస్థాపకులు కమలా మనోహర్, నరేంద్రస్వామి చేతుల మీదుగా సిద్ధారెడ్డి అవార్డు అందుకున్నారు.

'ప్రజావాణి'కి బాధితుల క్యూ

- ఆర్జీదారులతో కిటకిటలాడిన కలెక్టరేట్
- ఓపికపట్టండి అందరి సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పతుకమ్మ, విజయదశమి పండుగల హడావుడి నుంచి తేరుకున్న జనాలు ఇక తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు దారిపట్టారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలకు అర్జీలు అందజేశారు. భారీగా ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ ఆర్జీదారులతో కిటకిటలాడింది. అర్జీల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ ఓపిక పట్టండి మీ సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, ఆర్జీదారులు మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందిపడ్డారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

మెదక్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 79 అర్జీలు రాగా.. ఇందులో భూ సమస్యలు 38, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 11, ఉపాధి 5, రుణమాఫీ 2, పింఛన్ 2, ఇతర సమస్యలకు సంబంధించి 21 దరఖాస్తులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఆర్డీవో కార్యాలయ ప్రజావాణిలో 14 ఫిర్యాదులు

తూప్రాన్/అల్లాదుర్గం, అక్టోబరు 21 (తూప్రాన్): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ధరణి సమస్యలకు సంబంధించిన 14 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవిఓ జయచంద్రారెడ్డి తెలిపారు. అలాగే అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం: ఎమ్మెల్యే రోహిత్‌రావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట/వెల్దుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి, రజాక్‌పల్లి, కల్వకుంట, వెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. దళారులను నమ్మకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏపీఎం రామయ్య, కాంగ్రెస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు ఆయా గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో ఉమాదేవి, సొసైటీ ఛైర్మన్ అనంతరెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్ డివిజన్‌లో 130 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నర్సాపూర్,అక్టోబరు 21: నర్సాపూర్ డివిజన్‌లో ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 130 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని వ్యవసాయ మార్కెటింగ్ కార్యదర్శి ప్రతాప్‌గౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ నేతలతో ఎంపీ సమీక్ష



నాందేడ్ జిల్లా నాయకులతో ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు నాందేడ్ పార్లమెంట్ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. ఈ నేపథ్యంలో షెట్కార్ ఆ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌చౌహాన్‌తోపాటు పార్లమెంట్ స్థానం పరిధిలోని బోకర్, నాందేడ్‌నార్త్, నాందేడ్ సౌత్, నయాగాంవ్, దెగ్లూర్, ముఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆ పార్లమెంట్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. నాందేడ్ పార్లమెంట్ స్థానంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయానికి అనుసరించాల్సిన ప్రణాళికలు రూపొందించారు.

సమగ్ర ఆరోగ్య సమాచారం ఎంతో ముఖ్యం: కలెక్టర్

మెదక్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్య పరిరక్షణకు సమగ్ర ఆరోగ్య సమాచార నమోదు ఎంతో ముఖ్యమని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశం హాల్‌లో ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కాగా ప్రజల సమగ్ర ఆరోగ్య సమాచారం నమోదు చేయాలని ఆశా కార్యకర్తలను ఆదేశించారు. ఎప్పటికప్పుడు నాణ్యమైన సేవలందించడానికి రికార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరాం, డాక్టర్ నవీన్‌కుమార్ ఏవో, తూప్రాన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగూరు బ్యాక్ వాటర్ కాల్వలు పరిశీలించిన ఎమ్మెల్యే



సింగూరు బ్యాక్ వాటర్ కాల్వలను రిటైర్డ్ నీటి పారుదల శాఖ అధికారితో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరికి ఉపనదిగా ఉన్న మంజీరానది నాగల్‌గిద్ద, మనూరు మండలాల నుంచి ప్రవహించి సింగూరుకు చేరుకుంటుంది. సింగూరు బ్యాక్‌వాటర్‌లో ప్రవహించే కాల్వల నీటిని రైతులకు ఉపయోగపడే విధంగా డిజైన్ చేయడం కోసం సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రిటైర్డ్ నీటి పారుదల శాఖ అధికారి విఠల్‌రావుతో కలిసి కాల్వలను పరిశీలించారు. సింగూరు బ్యాక్ వాటర్‌ను వ్యవసాయానికి వినియోగిస్తే అనేకమంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, అందువల్ల క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాజెక్టు రూపకల్పన కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాది బోజిరెడ్డి, ఎన్ఎస్ఐయూ నియోజకవర్గ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ఉన్నారు.

వట్‌పల్లి ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా కొప్పుల లక్ష్మీశేషారెడ్డి

- వైస్ ఛైర్మన్‌గా మన్నె ఈశ్వరయ్య



శేషారెడ్డి

అల్లాదుర్గం, అక్టోబరు 21.(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రభుత్వం నియమించింది. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మీశేషారెడ్డి ఛైర్‌పర్సన్‌గా, వట్‌పల్లి మండలానికి చెందిన మన్నె ఈశ్వరయ్యను వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా చిన్నెళ్లి పాపయ్య, దేవసోత్ రాజు, మహ్మద్ అబ్దుల్ ఫజీల్, మద్దూరి రాజు గౌడ్, కుమ్మరి సాయిలు, భూపాల దిగంబర్‌రావు, సయ్యద్ హబీబొద్దీన్, పట్లోళ్ల భద్రారెడ్డి, గంజి సంగమేశ్వర్, చాకలి లక్ష్మయ్య, పెద్దగొళ్ల నాగయ్య, కల్లెటి శ్రీధర్‌తో పాటు వట్‌పల్లి పీఏసీఎస్ ఛైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి (సంగారెడ్డి) అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయశాఖ (ఏడీఏ) రాయికోడ్, వట్‌పల్లికి ప్రత్యేక అధికారి సభ్యులుగా నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పుష్కరకాలం తర్వాత మండలానికి ఛైర్మన్ పదవి లభించడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రికి కృతజ్ఞతలు: శేషారెడ్డి

ఇదిలా ఉండగా వట్‌పల్లి ఏఎంసీ ఛైర్మన్ పదవి అల్లాదుర్గం మండలానికి దక్కడంపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్యం కోసం అందజేస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజోల్ గ్రామానికి చెందిన చాకలి మారుతీ కుటుంబసభ్యులకు రూ.1.25 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని, మరికొందరు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం ముదిరాజ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది: ఎమ్మెల్యే

వెల్దుర్తి/కౌడిపల్లి/కొల్చారం/శివ్వంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తప్పుడు హామీలతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద నిర్వహించిన రైతు భరోసా ధర్నా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతు బంధు ఇవ్వలేదని మెదక్-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి 765డీపై శివ్వంపేట బీఆర్ఎస్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. బూటకపు హామీలతో రైతులను మోసం చేసిన ప్రభుత్వం గద్దెదిగాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొల్చారంలో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ రమేష్ కుమార్, మాజీ సీడీసీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. రైతు బంధును తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలోసంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. గంటపాటు ధర్నా నిర్వహించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

ప్రతి ఒక్క 'గ్రాడ్యుయేట్' ఓటు నమోదు చేసుకోవాలి

- టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, కార్యదర్శి వి.రవి సూచించారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, నిర్మలరాజకుమారి, శ్రీనివాస్, శివరాజ్, షకీల్, వెంకటేశం, సంపత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి



తూప్రాన్: డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్/పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో అమరులైన పోలీసుల సేవలు మరువలేనివని తూప్రాన్ డీఎస్పీ ఎస్.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్‌లోని నర్సాపూర్ చౌరస్తా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి ఎస్ఐ శివానందంతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

వర్షార్పణం

(5వ పేజీ తరువాయి)



జంగరాయిలో రోడ్డుపై తడిసి ముద్దయిన ధాన్యం

కొట్టుకుపోతుంటే అన్నదాతలు బావురుమన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 496 కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, సహకార, సివిల్ సప్లై, ఎఫ్‌పీవోల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 270 కేంద్రాలను ప్రారంభించారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ధాన్యం తడిసి ముద్దవుతోంది. వాటిని వెంటనే ఆరబెడుతున్నారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మళ్లీ వర్షం కురుస్తుండడంతో తిరిగి ఆరబెడుతున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షానికి వడ్లు తడవకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో లేవని, ప్రైవేటుగా ఒక్కో కవర్‌కు రోజుకు రూ.15 అద్దె చెల్లించాల్సి వస్తోందని మెదక్ మార్కెట్‌యార్డులో ఓ రైతు వాపోయాడు. వర్షాలు ప్రారంభమైనా అధికారులు ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదని, ఎన్ని రోజులు కేంద్రాల వద్ద ఎదురు చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ శాతం, తరుగు, ఇతరత్రా కొర్రీలు పెట్టి నిర్వాహకులు మరింత ఆలస్యం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోళ్లకు అనుమతులు రాలేదు

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. కానీ, ఇంకా సివిల్ సప్లై కమిషనరేట్ నుంచి కొనుగోళ్లకు అనుమతులు రాలేదు. ఇప్పటికిప్పుడు ఏ ఒక్క రైస్ మిల్లుకూ ధాన్యాన్ని అప్పగించలేం. కోటా ఖరారు అయ్యాకే ధాన్యం కాంటా పెడతాం. అంతేకాకుండా ధాన్యం శుభ్రపర్చడానికి సమయం పడుతుంది. ప్రస్తుతం వానలు కురుస్తున్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు అనుమతిస్తే ప్రస్తుతం ఉన్న గోదాములలో నిల్వచేస్తాం. గత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 9,500 టార్పాలిన్లు కేంద్రాల నిర్వాహకుల వద్దే ఉన్నాయి. మరో 2,500 టార్పాలిన్లు తెప్పిస్తున్నాం.

- హరికృష్ణ, డీఎం, సివిల్ సప్లై, మెదక్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రమేష్(ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ పోషణ భారం కాగా మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన బోయిని రమేష్(35) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో కొద్దిరోజులుగా ఇబ్బందిపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లోంచి బయటకు వెళ్లి కల్వకుంట శివారులో రోడ్డు పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చిన్నారి మృతిపై అధికారుల విచారణ

కల్హేర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కల్హేర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో మూడునెలల బాలిక మృతిచెందిన సంఘటనపై సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు సోమవారం విచారణ జరిపారు. కల్హేర్‌కు చెందిన కొక్కొండ ఓంసాయి, అనిత దంపతుల కూతురు ఆరాధ్య(3)ను కల్హేర్ ఆస్పత్రికి టీకాకు తీసుకెళ్లారు. టీకా అనంతరం బాలిక అస్వస్థతకు గురై మరణించిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి విష్ణు, సదాశివపేట ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అశోక్ విచారణ జరిపారు. బాధితుల, ఆస్పత్రి వైద్యుడు అనిల్‌రెడ్డి, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

వైభవంగా యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

రాయికోడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాయికోడ్‌లోని హనుమాన్‌మందిరం పునఃప్రారంభం సందర్భంగా ఆరురోజుల నుంచి నిర్వహించిన సప్త కార్యక్రమం చివరిరోజు సోమవారం యంత్ర ప్రతిష్ఠ, దేవతల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలతో ముగిసింది. ముందుగా సద్గురు మాధవానంద సరస్వతీ స్వామిచే స్వస్తివాచనము, మంటప పూజ, అంజనేయస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమంతుడిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పదివేల బ్రాంచీలు ఏర్పాటే లక్ష్యం: సీజీఎం

నర్సాపూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత అందుబాటులో సేవలందించాలనే ఉద్దేశంతో కెనరా బ్యాంకు బ్రాంచీలను దేశవ్యాప్తంగా పదివేల వరకు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు బ్యాంకు సీజీఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో కెనరా బ్యాంకు బ్రాంచీని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 9,750 బ్రాంచీలు ఏర్పాటు చేశామని, తెలంగాణలో నర్సాపూర్ బ్రాంచీ 362 బ్రాంచీగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు, పద్మశ్రీ హన్మంతరావు, ఏజీఎం శ్రీనివాస్, రీజినల్ మేనేజర్ ప్రదీప్, బ్రాంచీ మేనేజర్ యుగంధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మురళీధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంజీవరావు



సంజీవరావు, రవీందర్‌రెడ్డి, పుండ్లిక్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం(జీహెచ్ఎం) సంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎల్.సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా కె.పుండ్లిక్, గౌరవ అధ్యక్షుడిగా పి.సుధాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి, కోశాధికారి తుకారాం, పరిశీలకులు మదన్‌మోహన్, సత్యంల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉత్తమ డ్యాన్సర్, ఉపాధ్యాయ పురస్కారాలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఉత్తమ డ్యాన్సర్‌గా పత్తిగారి కుశలగౌరీ, ఉత్తమ ఉపాధ్యాయులుగా పత్తిగారి మల్లికార్జున్‌గౌడ్, పత్తిగారి మధులతలు పురస్కారాలు అందుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రగతి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాసరాజు, దైవజ్ఞశర్మ, మాజీ ఎంపీ వేణుగోపాలచారీ, పలువురు సినీనటుల నుంచి వారు అవార్డులు స్వీకరించారు.

విద్యార్థినులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జనహిత సేవా ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్తహీనత నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా సుమారు 165 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. కాగా రక్తదాన్‌సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి బ్లడ్‌గ్రూపింగ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.అరుణాబాయి, వైస్ ప్రిన్సిపాల్ కస్తూరి, అధ్యాపకులు పాల్గొన్నారు.


గురుకుల ఐటీఐలో అప్రెంటిస్ షిప్ మేళా

హత్నూర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర గురుకుల ఐటీఐలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ షిప్ మేళాకు ఏడు పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలోని ఆయా ఐటీఐల్లో పలు ట్రేడ్లు పూర్తిచేసిన 60 మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 35 మందిని ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసినట్లు హత్నూర గురుకుల ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు: ఏబీవీపీ

జహీరాబాద్/తూప్రాన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లు భిక్షకాదని, అది వారి హక్కని ఏబీవీపీ నాయకులు ప్రసాద్‌సాగర్ తదితరులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ ఆధ్వర్యంలో తూప్రాన్‌లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆందోళనలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, కార్యకర్తలు కార్తీక్, ఎల్లం, అబు, సాయికిరణ్, అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రిష్టాపూర్ పాఠశాల విద్యార్థులు

కల్హేర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని క్రిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రెండు విభాగాల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుధాకర్ సోమవారం తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి అండర్-18 ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జి.సంయుక్త, డి.పూజ, జె.వసంత, కె.హర్షిత 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే 43వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. 20న సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-14 విభాగం ఖోఖో పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన ఆర్.సోనా 28 నుంచి 30 వరకు కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. దీనికి విశేష కృషిచేసిన పాఠశాల పీఈటీ రాములును హెచ్ఎం సుధాకర్, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అరవింద్

చిన్నశంకరంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన క్రీడా సమాఖ్య వాలీబాల్ పోటీల్లో చిన్నశంకరంపేట మండలం మడూర్ హైస్కూల్ విద్యార్థి అరవింద్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 28 నుంచి 30 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.